సాక్షి కుమురం భీం

సోమవారం, 21, ఆగస్టు, 2023



సమస్యల్లో 'రీట్‌గూడ'

9లో▸

వాంకిడి మండలం చిచ్చుపల్లి పంచాయతీ పరిధి రీట్‌గూడ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. విద్యుత్, తాగునీరు, రహదారులు లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు.

'కుమురంభీం' గేటు ఎత్తివేత

ఆసిఫాబాద్: జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వట్టివాగు, కుమురంభీం ప్రాజెక్టుల్లో నీటి మట్టం పెరిగింది. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 243 మీటర్లు కాగా ఆదివారం రాత్రి 237.100 మీటర్లకు చేరినట్లు ప్రాజెక్టు ఏఈ మదినా షేక్ తెలిపారు. ఇన్‌ఫ్లో 730, ఔట్ ఫ్లో 400 క్యూసెక్కులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎగువ నుంచి వరదనీరు వస్తుండడంతో ప్రాజెక్టు 5వ గేట్ ఎత్తివేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.5/24.6

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఏఐసీసీ అధ్యక్షుడిని కలిసిన అనిల్‌కుమార్



మల్లికార్జున్ ఖర్గేతో అనిల్‌కుమార్

ఆసిఫాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ ముఖ్యనాయకుల నేతృత్వంలో ఆదివారం ఢిల్లీలోని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో సమావేశం నిర్వహించారు. సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క, జిల్లా కేంద్రానికి చెందిన టీపీసీసీ సభ్యుడు అనిల్‌కుమార్ కామ్రే, నేషనల్ కోఆర్డినేటర్ కొప్పుల రాజుతో కలిసి ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, సాధ్యాసాధ్యాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెల 26న చేవెళ్లలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై మల్లికార్జున ఖర్గే ప్రకటన చేయనున్నట్లు తెలిపారు.

నేటి ప్రజావాణి రేపటికి వాయిదా

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల మంగళవారానికి వాయిదా వేసినట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు, దరఖాస్తుదారులు గమనించాలని ఆయన సూచించారు.

మోదీ నాయకత్వం అవసరం



వాల్‌పెయింటింగ్ చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం తెలంగాణ రాష్ట్రానికి కూడా ఎంతో అవసరమని మహారాష్ట్రలోని చిమూర్ ఎమ్మెల్యే బంటి భావు బాంగ్డియా అన్నారు. బీజేపీ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో వాల్ పెయింటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ్‌రావ్ హూలీ

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణాలో రాబోయే ఎన్నికల్లో ఆసిఫాబాద్ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలని మహారాష్ట్రలోని గడ్చిరోలి ఎమ్మెల్యే దేవ్‌రావ్ మడ్‌గుజీ హూలీ సూచించారు. ఆదివారం నియోజకవర్గంలో పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీరా ఆత్మారాం నాయక్, కృష్ణకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్ పాల్గొన్నారు.

కుష్ఠు కట్టడికి సై..



జిల్లా కేంద్రంలో సర్వే చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న సర్వే
- పాల్గొంటున్న 900 మంది సిబ్బంది
- 243మంది అనుమానితుల గుర్తింపు
- 85మందికి చికిత్స చేస్తున్న వైద్యులు

జిల్లాలో కుష్ఠు సర్వే వివరాలు		
సర్వే చేయనున్న ఇళ్లు: 1,29,170	నిర్వహించనున్న పరీక్షలు: 5,51,076	
సర్వేలో పాల్గొంటున్న సిబ్బంది: 900	వ్యాధి అనుమానితుల సంఖ్య: 213	చికిత్స పొందుతున్న వారి సంఖ్య: 85

ఆసిఫాబాద్‌అర్బన్: కుష్ఠు కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా ఇంటింటా సర్వే నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన లెప్రసీ సర్వే 31వరకు కొనసాగనుంది. గడిచిన నాలుగు రోజుల్లో 46వేల మందిని సర్వే చేసి 213 మంది అనుమానితులను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. కుష్ఠుపై అవగాహన కలిగి ఉండి మొదటి దశలో గుర్తిస్తే నివారణ సులభమేనని వైద్యులు చెబుతున్నారు. ప్రజలు ఎలాంటి అపోహలు, ఆందోళనకు గురికావద్దని సూచిస్తున్నారు.

ప్రారంభంలో చికిత్స సులభమే..

కుష్ఠును ప్రారంభంలో గుర్తిస్తే చికిత్స సులభమని వైద్యులు చెబుతున్నారు. మచ్చలను ప్రారంభంలో గుర్తించి ఎండీటీ (మల్టీ డ్రగ్ థెరపీ) చికిత్స తీసుకుంటే అంగవైకల్యానికి దారితీసే అవకాశాలుండవని పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,29,170 ఇళ్లకు వెళ్లి 5,51,076 మందిని సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం మినహాయించి 14రోజుల పాటు సర్వే కొనసాగనుంది. ఒక ఆశ కార్యకర్త ప్రతిరోజూ రూరల్‌లో అయితే 20 ఇళ్లు, అర్బన్ ఏరియాల్లో 25 ఇళ్లను సర్వే చేయాలని లక్ష్యం విధించారు.

పూర్తి స్థాయిలో నివారించినా..

ప్రభుత్వం 1985లో దేశవ్యాప్తంగా కుష్ఠును పూర్తిస్థాయిలో నివారించినట్లు ప్రకటించింది. అయితే ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలో వ్యాధి మళ్లీ విజృంభిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఏటా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుండడమే ఇందుకు నిదర్శనం. ప్రజల్లో మారుతున్న ఆహారపు అలవాట్లే ఇందుకు కారణమని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో చేపట్టిన సర్వేలో ఇప్పటివరకు 213 మంది అనుమానితులను వైద్యాధికారులు గుర్తించారు. 85మందికి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం లెప్రసీ సర్వేకు సరిపడా సిబ్బంది లేక పరీక్షలు నిర్వహించడంలో జాప్యం జరుగుతోంది. ఉన్న సిబ్బందితోనే సర్వే చేయాల్సి వస్తోంది.

ఇవీ లక్షణాలు..

కుష్ఠు ప్రధానంగా నరాలు, చర్మానికి సోకుతుంది. వ్యాధి చాలా నెమ్మదిగా వ్యాపిస్తుంది. లక్షణాలు బహిర్గతం కావడానికి సగటున మూడేళ్లు పడుతుంది. శరీరంపై మచ్చలు సహజ చర్మపు రంగుకంటే తక్కువ లేదా ఎరుపు రాగి రంగు కలిగి ఉంటాయి. మచ్చలపై స్పర్శ, నొప్పి ఉండదు. ఈ మచ్చలు శరీరంలోని ఏ ప్రాంతంలోనైనా రావచ్చు. వ్యాధి రావడానికి వయస్సు, లింగభేదం లేదు. వంశపారంపర్యంగా, శాపం, పాపం వలన రాదు. వ్యాధి ఎండీటీ చికిత్సతో ఆరు నెలల నుంచి 12 నెలల్లో పూర్తిగా నయమవుతుంది. వ్యాధి నయమైన తర్వాత బాధితులు సామాజిక జీవితం గడపవచ్చని వైద్యులు చెబుతున్నారు. చికిత్స పూర్తయిన తర్వాత, చికిత్స తీసుకుంటున్న రోగుల్లో అంగవైకల్యం ఉంటే శస్త్రచికిత్స ద్వారా సరిచేయవచ్చని పేర్కొంటున్నారు.

సర్వేకు సహకరించాలి



జిల్లా వైద్యాధికారి రామకృష్ణ ఆదేశాల మేరకు ఈనెల 16నుంచి జిల్లాలో లెప్రసీ సర్వే ప్రారంభించాం. 31వ తేదీ వరకు సర్వే కొనసాగుతుంది. ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తున్నాం. సర్వేలో 900 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. ఎలాంటి అనుమానం ఉన్నా వైద్యులను సంప్రదించాలి. ఇప్పటివరకు 213 మంది అనుమానితులను గుర్తించాం. వారికి తిరిగి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేస్తాం. తదుపరి చికిత్స అందిస్తాం. సర్వేకు ప్రజలు సహకరించాలి.

– సుధాకర్‌నాయక్, ప్రోగ్రాం అధికారి

ఇంటర్‌లో ఇంగ్లిష్ ప్రాక్టికల్స్

- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు
- ఆంగ్లంపై పట్టుకోసం చర్యలు
- జిల్లాలో 48 కళాశాలలు



ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచి ఆంగ్లంలో ప్రాక్టికల్స్ విధానానికి ఇంటర్ బోర్డు శ్రీకారం చుట్టింది. విద్యార్థి జీవిత లక్ష్యం చేరేందుకు పదో తరగతి తర్వాత ఇంటర్ విద్య వేదికగా భావిస్తారు. ప్రస్తుతం అన్నిరంగాల్లో ఆంగ్ల విద్యకు ప్రాధాన్యత ఎక్కువగా ఉండడంతో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సమగ్ర వికాసం చెందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇంగ్లిష్ విద్యలో పట్టుసాధిస్తే ఉద్యోగ సాధనలో సైతం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్‌లో ప్రాక్టికల్స్ అమలు చేయనుంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి...

జిల్లాలో మొత్తం 48 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ కళాశాలలు 11, ప్రైవేట్ కళాశాలలు 05, కేజీబీవీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలు 32 ఉన్నాయి. మొత్తం 11,018 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5,843 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,175 మంది ఉన్నారు. వారందరికీ ఈ విద్యాసంవత్సరం నుంచి ఆంగ్లంపై పట్టు సాధించేలా ఇంటర్ బోర్డు ఇంగ్లిష్ సెబ్జెక్టుకు సైతం సైన్స్ కోర్సుల మాదిరి ప్రాక్టికల్స్ అమలు చేయనుంది.

ప్రాక్టికల్స్ ఇలా....

ప్రాక్టికల్స్‌ను మొత్తం ఐదు విభాగాలుగా విభజించారు. ప్రాక్టికల్స్‌కు 20 మార్కులు, థియరీకి 80 మార్కులు కేటాయించారు. కమ్యూనికేటివ్ ఫంక్షన్స్‌కు 4 మార్కులు, ఏదైనా ఒక సామాజిక అంశంపై ఇంగ్లిష్‌లో తప్పులు లేకుండా మాట్లాడడానికి 4, స్పష్టంగా చదవడానికి 4, రోల్‌ప్లే (వివిధ సందర్భాల్లో ఇద్దరి మధ్య సంభాషణ)కు 4 మార్కులు, వింటూ అర్థం చేసుకోవడానికి 4 మార్కులు ఉంటాయి. ఇలా ఒక్కో దశకు నాలుగు మార్కుల చొప్పున 20 మార్కులు కేటాయిస్తారు. విద్యార్థులు పలు రకాల ప్రశ్నలను తయారు చేసుకుంటే ఉపాధ్యాయులు సందర్భం ఆధారంగా ప్రశ్నించేతత్వాన్ని నేర్పిస్తారు.

ఆంగ్లంపై పట్టు సాధించేలా...

విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించేలా ఇప్పటి నుంచి ఇంగ్లిష్ సామర్థ్యాలను నేర్పిస్తున్నారు. చాలామంది విద్యార్థులు ఇంగ్లిష్ అంటేనే భయపడుతుంటారు. దీనిని గమనించిన ప్రభుత్వం విద్యార్థులకు ఇంగ్లిష్ భాషపై మక్కువ పెంచేలా చర్యలు చేపడుతోంది. చదవడం, రాయడం, మాట్లాడడం అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. సంభాషణ ద్వారా 30 రకాల మాడ్యూళ్లలో విద్యార్థుల మధ్య కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించడం, ఆడియో, వీడియో ద్వారా నేర్చుకోవడం, నేర్చుకున్న దాన్ని నెమరు వేసుకోవడం వంటి స్కిల్స్ పెంపొందించడం వంటివి నేర్పిస్తున్నారు. ఇంగ్లిష్ సబ్జెక్టు ప్రాక్టికల్స్ నిర్వహించే ముందు ప్రాక్టికల్ విధానంతో విద్యార్థులకు ఆంగ్లంపై కమ్యూనికేషన్ పెరిగి భవిష్యత్‌లో ఉద్యోగ సాధనతో పాటు ఏ ప్రాంతానికి వెళ్లినా సులభంగా అక్కడ పరిస్థితులు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఆంగ్లంపై భయం పోతుంది



గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు మాతృభాష తప్ప ఇతర భాషలో మాట్లాడడానికి ఇష్టపడరు. ఈ ప్రాక్టికల్ పరీక్షల కారణంగా విద్యార్థుల్లో మాట్లాడడం తప్పనిసరి చేయడం వల్ల భాషా నైపుణ్యాలు మెరుగుపుతాయి. ఈ విధానంపై అధ్యాపకులకు త్వరలో నిపుణులతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయిస్తాం

– శ్రీధర్ సుమన్, డీఐఈవో

విద్యార్థులకు మేలు

నిత్య జీవితంలో విద్యార్థులకు ఆంగ్లం వాడుకం ఎంతో ఉపయోగపడుతుంది. విద్యార్థుల్లో ఆంగ్ల భాష పట్ల ఆసక్తిని పెంపొందించడానికి సిలబస్‌లోని అన్ని మాడ్యూల్స్‌ని అభ్యసనం చేయిస్తున్నాం. విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు ఈ ప్రాక్టికల్స్ ఎంతో దోహదం చేస్తాయి.

– అమరేందర్, సిలబస్ రైటర్

హైదరాబాద్ సమ్మెలో జిల్లా నాయకులు



సమ్మెలో పాల్గొన్న బోగె ఉపేందర్

ఆసిఫాబాద్‌అర్బన్: వైద్యారోగ్యశాఖలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలన్న డిమాండ్‌తో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమ్మెలో కుమురంభీం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌ఎంల డిమాండ్లు వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాచర్ల, పుణ్యవతి, భూదేవి, అవునూరి, కమల, సునీత పాల్గొన్నారు.

ఐక్యతతోనే బీసీలకు రాజ్యాధికారం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రమేశ్

రెబ్బెన(ఆసిఫాబాద్): బీసీ కులాలు ఐక్యంగా ఉన్నప్పుడే రాజ్యాధికారం సాధించుకోవచ్చని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్నర్ రమేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొండపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రకాలుగా వెనుకబడిన బీసీల్లో ఎంతో మంది యువకులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. బీసీలకు సైతం దళితబంధు తరహాలో బీసీబంధు అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కలిసి రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కొండపల్లిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని గ్రామానికి కనీసం మంచి రోడ్డు సౌకర్యం కూడా లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్యం దుకాణాలకు లక్కీడ్రా

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- డ్రా తీయనున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ

ఆసిఫాబాద్: జిల్లాలో మద్యం టెండర్ల ప్రక్రియలో భాగంగా సోమవారం లక్కీ డ్రా నిర్వహించేందుకు జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని జి–36 సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు కలెక్టర్ హేమంత్ బోర్కడే చేతుల మీదుగా డ్రా పద్ధతిలో దుకాణాలు కేటాయించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 32 మద్యం దుకాణాలకు 967 దరఖాస్తులు వచ్చాయి. తొలుత గెజిట్ 01 నుండి 10 వరకు దరఖాస్తు దారులను సమావేశ మందిరంలోకి అనుమతిస్తారు. ఎక్సైజ్ శాఖ గెజిట్ ప్రకారం దుకాణాల వారీగా లోనికి అనుమతిస్తారు. 27 దుకాణాలకు సోమవారం లక్కీ డ్రా నిర్వహిస్తామని, 10 కంటె తక్కువ దరఖాస్తులు వచ్చిన రెబ్బెన, గోలేటి, లోనవెల్లి, సిర్పూర్(యూ), లింగాపూర్ షాపులకు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి, ఆదిలాబాద్ డెప్యూటీ కమిషనర్ నర్సింహారెడ్డి తెలిపారు. దరఖాస్తు దారులు ఉదయం 9 గంటలకే జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరానికి చేరుకోవాలన్నారు. లక్కీ డ్రా నేపథ్యంలో డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ముగ్గురు ఎస్సైలు, 70 మంది పోలీసు బలగాలతో కలెక్టరేట్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి తెలిపారు.

'ప్లాన్'పై ఫైట్..

- అంటుకున్న 'మాస్టర్' మంటలు
- అట్టుడుకుతున్న నిర్మల్
- రెండోరోజూ 'బీజేపీ'పై లాఠీచార్జి
- ఆమరణదీక్షలోనే మహేశ్వర్‌రెడ్డి
- ముథోల్ ఎమ్మెల్యే సంఘీభావం
- నిర్మల్‌లో బీజేపీ వర్సెస్ బీఆర్‌ఎస్

నిర్మల్: మాస్టర్‌ప్లాన్ మంట పెట్టింది. ముసాయిదా చుట్టూ ముసురుకున్న లొల్లి ముదిరింది. బృహత్ ప్రణాళికపై పోరు వేడెక్కడంతో రెండ్రోజుల నుంచి పట్టణం ఉద్రిక్తంగా మారింది. ఐదురోజులుగా మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆమరణదీక్ష కొనసాగిస్తుండటం, ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో బీజేపీ ఆదివారం కూడా రోడ్డెక్కింది. మంత్రి ఇంటిని ముట్టడించేందుకు యత్నించింది. కానీ.. వరుసగా రెండోరోజూ బీజేపీ శ్రేణులపై పోలీసుల లాఠీ దెబ్బపడింది. నిర్మల్‌లో మంత్రి ఇంటి ముట్టడికి వచ్చిన వారిపై ఇష్టారీతిన పోలీసులు లాఠీచార్జి చేయడం, బలవంతంగా లాక్కెళ్లడంతో పదుల సంఖ్యలో మహిళలు, కార్యకర్తలు గాయపడ్డారు. మరోవైపు బీజేపీ చేసిన ముట్టడికి ప్రతిగా తాము సోమవారం ఏలేటి ఇంటిని ముట్టడిస్తామంటూ బీఆర్‌ఎస్ ప్రకటించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. రైతులూ.. మాస్టర్‌ప్లాన్ రద్దు చేసేవరకూ తగ్గేది లేదంటూ భీష్మించి కూర్చున్నారు.

ముథోల్ ఎమ్మెల్యే సంఘీభావం

మాస్టర్‌ప్లాన్ రద్దుపై మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఆమరణ దీక్ష ఐదురోజులుగా కొనసాగుతోంది. జీవో నంబర్ 220ను పూర్తిగా రద్దుచేయాలన్న ఏకైక డిమాండ్‌తో ఆయన చేస్తున్న దీక్ష రోజురోజుకూ సీరియస్‌గా మారుతోంది. పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌ను నిర్మల్‌కు రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. మహారాష్ట్రలోని ముథోల్ ఎమ్మెల్యే తుషార్ రాథోడ్ వచ్చి ఏలేటికి సంఘీభావం తెలిపారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మహిళలు మద్దతు తెలిపారు. మహేశ్వర్‌రెడ్డి ఆరోగ్యం క్షీణిస్తుండటంతో శనివారం నుంచి బీజేపీ సీరియస్‌గా స్పందిస్తోంది. వరుసగా రెండోరోజైన ఆదివారం బైల్‌బజార్‌వద్ద రాస్తారోకో చేసింది. అనంతరం మంత్రి ఇంటి ముట్టడికి ప్రయత్నించింది.

మళ్లీ లాఠీచార్జి..

జిల్లాకేంద్రంలోని బస్టాండ్ ఎదుట బీజేపీ ఆందోళనపై లాఠీచార్జి చేసిన పోలీసులు ఆదివారం మంత్రి ఇంటి ముట్టడికి వచ్చిన వారిపైనా అదేతీరులో స్పందించారు.



ఏలేటికి సంఘీభావం తెలుపుతున్న ముథోల్ ఎమ్మెల్యే తుషార్‌రాథోడ్

ముందుగా మహేశ్వర్‌రెడ్డి దగ్గరకు పోలీసులు వెళ్లే ప్రయత్నం చేయగా, పార్టీ నాయకులు గేట్ మూసి అక్కడే బైఠాయించారు. పోలీసులు గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. మళ్లీ అక్కడి నుంచి బైల్‌బజార్ చౌరస్తాకు వచ్చి భారీ సంఖ్యలో రాస్తారోకో చేపట్టారు. మంత్రి ఐకేరెడ్డి, మాస్టర్‌ప్లాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా మంత్రి ఇంటి ముట్టడికి బయలుదేరిన బీజేపీ శ్రేణులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా మహిళలు, యువకులు మంత్రి ఇంటివరకూ వచ్చే ప్రయత్నం చేయడంతో ఒక్కసారిగా డీఎస్పీ గంగారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు లాఠీచార్జికి దిగారు. దొరికినవాళ్లను దొరికినట్లు చితకబాదుతూ చెదరగొట్టారు. నాయకులు, మహిళలను బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించి, ఠాణాలకు తరలించారు. ఇందులో పదుల సంఖ్యలో యువకులు, మహిళలు గాయపడ్డారు. పోలీసులు శనివారం ఆందోళనలో పాల్గొన్నవారిలో 16మంది, ఆదివారం ఘటనలో 12మందిపై కేసులు నమోదు చేశారు. దీనిపై బీజేపీ సీరియస్‌గా స్పందించింది. ఈ విషయం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఆయన ద్వారా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వరకూ వెళ్లింది.

బీజేపీ వర్సెస్ బీఆర్‌ఎస్

జిల్లాకేంద్రంలో మాస్టర్‌ప్లాన్ లొల్లి మరింత ఉద్రిక్తంగా మారుతోంది. బీజేపీ లేవనెత్తిన ముసాయిదా రద్దు అంశంపై బీఆర్‌ఎస్ కౌంటర్‌కు సిద్ధమైంది. ఇందులో భాగంగా బీజేపీ శ్రేణులు మంత్రి ఇంటి ముట్టడికి యత్నించి వెళ్లిన తర్వాత బీఆర్‌ఎస్ నాయకులు అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ మాట్లాడుతూ.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మహేశ్వర్‌రెడ్డి దీక్ష పేరిట డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి ఇంటిని ముట్టడించడానికి వస్తే చూస్తూ ఊరుకోబోమని, తాము సోమవారం ఏలేటి ఇంటిని ముట్టడిస్తామని వెల్లడించారు. ఈమేరకు పార్టీ పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ ఓ ప్రకటనలో బీఆర్‌ఎస్ శ్రేణులను కోరారు. అన్ని మండలాల నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు సోమవారం 11గంటలకు మంత్రి అల్లోల నివాసం వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

జ్వరంతో చిన్నారి మృతి

చింతలమానెపల్లి: జ్వరంతో బాలిక మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... లోకండి ప్రియదర్శిని(4) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. తరచుగా జ్వరం బారిన పడుతుండడంతో ఆదివారం చికిత్స కోసం వెళ్లాలని బాలిక తల్లితండ్రులు నిర్ణయించుకున్నారు. శనివారం రాత్రి పరిస్థితి విషమించి బాలిక మృతి చెందింది. బాలికకు స్థానికంగా ఆర్ఎంపీ వద్ద వైద్యం నిర్వహించారని, వైద్యం వికటించడంతోనే బాలిక మృతి చెందినట్లు పుకార్లు రావడంతో మండల పోలీసులు బాలిక తండ్రి ఆగయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించలేదని తేలినట్లు పోలీసులు తెలిపారు.

రాయిపేట వార్డుసభ్యురాలు..


ముత్తక్క (ఫైల్)

చెన్నూర్‌రూరల్: మండలంలోని రాయిపేట గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు దాగం ముత్తక్క(62) జ్వరంతో శనివారం రాత్రి మృతి చెందింది. నాలుగు రోజుల క్రితం ముత్తక్క జ్వరంతో స్థానికంగా చికిత్స చేయించుకుంది. రక్త కణాలు తగ్గాయని వైద్యులు తెలుపడంతో కుటుంబ సభ్యులు మంచిర్యాలకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది.

రూ. 70వేలు కావాలా.. రూ.వెయ్యి ఇచ్చుకోండి.!

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలోని గోదావరి నదిపై ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణంలో పలు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఈ క్రమంలో నిర్వాసితులకు ఇంటి, ఇంటి అడుగు స్థలం, మేజర్‌సన్స్ ఇలా అన్ని రకాల పరిహారాలు దశలవారీగా అందజేశారు. గత ఎన్నికలకు ముందు నిర్వాసితులకు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.70వేల పరిహారం అందజేస్తుందని వెలుగులోకి వచ్చింది. దీంతో అందరూ ఆశపడగా ఆ హామీ గత ఏడాదిగా దాదాపు 3,800 మంది లబ్ధిపొందేలా జాబితా వెలువడింది. జాబితా ప్రకారం ఒక్కో గ్రామానికి పరిహారం అందుతూ వస్తుండగా ప్రస్తుతం మండలంలో మరో 1,200 మందికి ఇంటి నిర్మాణానికి రూ.70వేల పరిహారం అందాల్సి ఉంది. తాజాగా ఈ పరిహారం చెల్లింపుల విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెంది ఓ ఇద్దరు నాయకులు రూ.70వేల పరిహారం ఇప్పిస్తామని, దీనికి ఆధార్ కార్డు, పాను కార్డు జిరాక్స్‌లతో పాటు రూ.1,000 నగదు అందజేయాలంటూ వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు సమాచారం. ఇలా కొంతమంది నాయకులు అమాయకులను లక్ష్యం చేసుకుని ఆర్థిక దోపిడీకి పాల్పడే ప్రయత్నాలు జోరుగా చేపడుతుండటం కొసమెరుపు.

ఒకరి ఆత్మహత్య

చింతలమానెపల్లి: మండలంలోని రుద్రాపూర్ గ్రామానికి చెందిన గుర్లె గోపాల్(33) పురుగుల మందుతాగి ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో తులసీదాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల... మేరకు గోపాల్ కొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడు. తాగిన మైకంలో ఈనెల 18న పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు మంచిర్యాలకు తరలించి చికిత్స అందించారు. ఆదివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య ఈశ్వరీబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

జైనూర్: విద్యాదాఘాతంతో ఒకరు మృతి చెందాడు. సర్పంచ్ నాగరావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని డబోలి పంచాయతీ పరిధిలోని గారెన్‌గూడకు చెందిన మేస్రం భీంరావ్(31) ఆదివారం పొలానికి వెళ్లాడు. పని పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో సాయంత్రం ఇంట్లో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సత్తాచాటిన సీవోఈ విద్యార్థులు

- ఎస్సెస్సీలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు
- తొలిప్రయత్నంలోనే విజయం
- అంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారే..


కార్తికేయ


అనిల్


నరేందర్


కార్తికేయకు మిఠాయి తినిపిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు

బెల్లంపల్లి: పోటీ పరీక్ష ఏదైనా సరే బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థులకు తిరుగులేకుండా పోతోంది. పరీక్షల్లో సునాయాసంగా నెగ్గి సర్కారు కొలువులు సాధిస్తున్నారు. ఆదివారం స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్సెస్సీ) ప్రకటించిన జీడీ కానిస్టేబుల్స్ ఫలితాల్లో సీఓఈ విద్యార్థులు సత్తా చాటారు. ఇక్కడ విద్యాభ్యాసం చేసిన ముగ్గురు విద్యార్థులు జీడీ కానిస్టేబుల్స్‌గా ఎంపికై మరోమారు సీఓఈ కళాశాల పేరును ఎలుగెత్తి చాటారు. ఈపాటికే సీఓఈ విద్యార్థులు ఇద్దరు జీడీ కానిస్టేబుల్స్‌గా ఎంపికై ఉద్యోగం చేస్తుండగా మరో ముగ్గురు విద్యార్థులు వారికి జత కలవడం విశేషం. సీవోఈలో ఇంటర్మీడియెట్ చదివిన చుంచు కార్తికేయ, గొడిసెల అనిల్, బుజాడి నరేందర్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ప్రటించిన జీడీ కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నారు. 2022లో ఉద్యోగాల భర్తీకోసం నోటిఫికేషన్ జారీ కాగా ప్రస్తుత ఏడాది జనవరిలో పోటీ పరీక్ష జరిగింది. రాత పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గత జులై నెలలో మెడికల్ టెస్టులు నిర్వహించారు. వివిధ దశల్లో నిర్వహించిన పరీక్షల్లో సదరు విద్యార్థులు మెరుగ్గా రాణిస్తూ తాజాగా ప్రకటించిన ఫైనల్ రిజల్ట్స్‌లో జీడీ కానిస్టేబుల్స్‌గా ఎంపికై రికార్డు సృష్టించారని సీవోఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. చుంచు కార్తికేయ బీఎస్ఎఫ్, గొడిసెల అనిల్ సీఆర్‌పీఎఫ్, బుజాడి నరేందర్ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సదరు విద్యార్థులకు మిఠాయి తినిపించి ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. ఒకేసారి బెల్లంపల్లి సీఓఈ విద్యార్థులు ముగ్గురు ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయమని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్, జాయింట్ సెక్రెటరీ సక్రూనాయక్, ఓఎస్డీ రంగారెడ్డి, ఆర్సీవో కొప్పుల స్వరూపారాణి విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడి అభినందనలతో ముంచెత్తారు.

తొలి ప్రయత్నంలోనే ....

సీఓఈలో చదివిన ముగ్గురు విద్యార్థులు ఉన్నత చదువులకు సిద్ధమవుతూనే మరో వైపు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జాతీయస్థాయి పోటీ పరీక్షకు సిద్ధమయ్యారు. ప్రైవేట్‌గా ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు. ఏమైనా అనుమానాలు కలిగితే సీఈవో ప్రిన్సిపాల్, అధ్యాపకులను సంప్రదించి నివృత్తి చేసుకున్నారు. ముఖ్యంగా కళాశాలలో నేర్చుకున్న అనేక అంశాలు, ఐఐటీ, నీట్ పరీక్షల ప్రిపరేషన్ సదరు విద్యార్థుల విజయానికి దోహదపడ్డాయి. పట్టుదలతో చదివి తొలి ప్రయత్నంలోనే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఉద్యోగాలను దక్కించుకోవడం గమనార్హం.

ప్రత్యేక ప్రణాళికతోనే విజయాలు



సీఓఈలో చదువుతున్న విద్యార్థులంతా దాదాపు గ్రామీణ నేపథ్యం నుండే వస్తున్నారు. వీరికి క్రమబద్ధంగా, ప్రత్యేక ప్రణాళికతో బోధన చేస్తూ ముందుకు నడిపిస్తున్నాం. గ్రామీణ విద్యార్థుల్లో ఏదో సాధించాలనే పట్టుదల ఉంటోంది. కానీ ఎలా సాధించాలో అంచనా వేసుకోలేరు. వారిలోని శక్తి యుక్తులు, నైపుణ్యతను గుర్తించి బోధించడం ఓ కారణం కాగా ఏదైనా సరే సాధించగలరనే నమ్మకాన్ని కలిగిస్తుండడంతో పోటీ పరీక్షల్లో నెగ్గి ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. సీవోఈకి పేరు తీసుకొస్తున్నారు.

– ఐనాల సైదులు, ప్రిన్సిపాల్, సీఓఈ కళాశాల బెల్లంపల్లి

ముగ్గురివి నిరుపేద కుటుంబాలే ...

జీడీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన ముగ్గురు విద్యార్థులవి అత్యంత పేద కుటుంబాలు . రెక్కల కష్టం తప్పా ఆస్తిపాస్తులు లేని కుటుంబాల్లో జన్మించిన సదరు విద్యార్థులు సీఓఈలో నేర్చుకున్న క్రమశిక్షణ, అబ్బిన చదువుతో కేంద్ర ప్రభుత్వ సర్కారు కొలువులు దక్కించుకున్నారు. చుంచు కార్తికేయది బెల్లంపల్లి. తండ్రి రమేష్ ఆటో డ్రైవర్ కాగా తల్లి రజిత గృహిణి. గొడిసెల అనిల్‌ది లక్సెట్టిపేట మండలం ఎల్లారం గ్రామం. తల్లిదండ్రులు లచ్చయ్య, సత్తవ్వ ఇద్దరు వ్యవసాయ కూలీలే. బుజాడి నరేందర్‌ది కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం అమరగొండ గ్రామం. తల్లిదండ్రులు శంకర్, లక్ష్మిలు. వీరిది అతిసాధారణ పేద కుటుంబం.

'పరేషానీ'.! మారేదెప్పుడో..


పరేడ్ మైదానంలో బీరు సీసాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ నెల 17వ తేదీ గురువారం పరేడ్ మైదానంలో 'పరేషానీ' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ఫొటో స్టోరీ ప్రచురితమైంది. అయినా కానీ మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానం (జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల) తీరు మారడం లేదు. స్వాతంత్ర్య దినోత్సవ సంబురాలు జరిగిన రోజునే కాదు నిత్యం పరేడ్ మైదానంలో మందుబాబుల ఆకృత్యాలు మాత్రం ఆగడం లేదు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని పోలీసులు ఆంక్షలు ఉన్నా అవేమీ పట్టించుకోవడం లేదు. అంతేకాదు పోలీసులు తనిఖీలు కూడా లేక మద్యంప్రియుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. వారి తీరు మారడం లేదు సరికదా మాకేంటి మమ్మల్ని అడ్డుకునేదెవరు అంటూ మస్తుగా.. మజాగా మందుబాబులు దావత్‌లు చేసుకుంటున్నారు. ఆదివారం ఉదయం ఇలా మైదానంలో తాగి మద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు కనబడ్డాయి. దీంతో ఉదయం వాకింగ్, యోగా, ఫిట్‌నెస్, పలు వ్యాయామల కోసం వెళ్లేవారికి మందుబాటిళ్లు, పగిలిన సీసాలు దర్శనమిస్తుండటంతో విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పరేడ్ మైదానంపై ప్రత్యేక దృష్టి సారించి మందుబాబుల ఆగడాలు అడ్డుకోవాలని కోరుతున్నారు.

బీఎస్ఎఫ్ జవాన్లుగా యువకులు


రమేశ్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ నిహారిక


వాగడి స్నేహిత్


ఉపాసే అశోక్

కౌటాల: మండలానికి చెందిన ముగ్గురు యువకులు ఆదివారం బీఎస్ఎఫ్ జవాన్లుగా ఎంపికయ్యారు. మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన వడాయి దివాంజీ– తారాబాయి దంపతుల కుమారుడు రమేష్, కౌటాల మండల కేంద్రానికి చెందిన వగాడి జీవన్– రాజమణి దంపతుల కుమారుడు స్నేహిత్, గుడ్లబోరి గ్రామానికి ఉపాసే బాబాజీ– కమల దంపతుల కుమారుడు అశోక్ బీఎస్ఎఫ్ జవాన్లుగా ఎంపికయ్యారు. రమేష్‌ను స్థానిక సర్పంచ్ వాసాకే నిహారిక జ్యోతిరావ్ శాలువతో సన్మానించారు.

పారామిలటరీకి ముగ్గురు..

పెంచికల్‌పేట్: మండలంలోని ఆయా గ్రామాలనుండి ముగ్గురు యువకులు కేంద్ర పారామిలటరీకి ఎంపికయ్యారు. ఇందులో పెంచికల్‌పేట్ గ్రామానికి గాదం రాజు, రౌతు సాగర్, బొంబాయి గూడకు చెందిన పొట్టె విద్యాసాగర్‌లు ఉన్నారు. ఎంపికైన యువకులను వారి తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు.


గాదం రాజు


రౌతు సాగర్


విద్యాసాగర్

ఎస్ఎస్‌బీకి 14 మంది..


అత్తె అభినందన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పారా మిలిటరీ విభాగంలోని ఎస్ఎస్‌బీ (సహస్త్ర సీమా బల్)కి మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మండలంలోని పెద్దంపేట గ్రామంలోని గొల్లపల్లికి చెందిన అత్తె అభినందన్ ఎస్ఎస్‌బీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఇంటర్ వరకు చదిన అభినందన్ కరీంనగర్‌లోని డిఫెన్స్ అకాడమిలో చదువుకున్నాడు. మొదటి ప్రయత్నంలోనే అభినందన్ ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు రజిత, చిన్నయ్య ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలోని టీకానపల్లి గ్రామంలో ఆరుగురు, కర్ణమామిడిలో ఇద్దరు, పెద్దంపేట గ్రామ పంచాయతీలోని గొల్లపల్లిలో ముగ్గురు, కొండాపూర్‌లో ఇద్దరు, గుడిపేటలో ఒక్కరితో కలిపి మొత్తం మండలంలో 14మంది ఎస్ఎస్‌బీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా బెజ్జూర్ వాసి


గిరిధర్

బెజ్జూర్: కేంద్ర సాయుధ పోలీసు బలగాల కానిస్టేబల్‌గా బెజ్జూర్ వాసి ఎంపికయ్యాడు. ఆదివారం వి డుదలైన బీఎస్ఎఫ్ ఫలితాల్లో అవుత్కర్ గిరిధర్ సత్తా చాటాడు. ఈ యన తల్లిదండ్రులు లక్ష్మణ్–సురేఖ. కూలీ పని చేసి జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడైన గిరిధర్ బీఎస్ఎఫ్ ఉద్యోగం సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తంచేశారు. దేశ ప్రజలకు సేవ చేయాలనే తన కోరిక ఈ ఉద్యోగంతో నెరవేరుతుందని గిరిధర్ తెలిపారు. గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు పలువురు ఆయన్ను అభినందించారు.

కేంద్ర బలగాల్లో జిల్లా యువకులు..


యువకులను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు యువకులు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా సీఐఎస్ఎఫ్, ఐటీబీపీలో కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. బజార్‌వాడికి చెందిన సయ్యద్ సుల్తాన్ అలీ(24) సీఐఎస్ఎఫ్, ఉస్మానియాకాలనీకి చెందిన ఉమర్‌బిన్ రైస్(21) సీఐఎస్ఎఫ్, తారకరామానగర్‌కు చెందిన రామడుగుల సాయి(20) ఐటీబీపీ, రాజంపేటకు చెందిన పిడుగు మనికృష్ణ(10) సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఈ క్రమంలో ఎంఐఎం ఆధ్వర్యంలో వారికి శాలువలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ సల్మాన్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి కశిఫ్ హష్మీ, అజీమొద్దిన్, ఆరిఫ్, అబ్బు, అఫ్జల్, హుమ్మలాల్, అఫ్రోజ్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

చేనేత సొసైటీ ఎన్నికలెప్పుడో..?


చెన్నూర్‌లో మగ్గంపై బట్టలు నేస్తున్న కార్మికుడు

- ఐదేళ్లుగా పర్సన్ ఇన్‌చార్జిలే దిక్కు
- ఏడాదికి ఏడాది గడువు పెంచుతూ వస్తున్న ప్రభుత్వం
- సొసైటీలకు ఎన్నికలు నిర్వహిస్తే కార్మికులకు మేలు

చెన్నూర్: చేనేత సహకార సంఘాల పాలకవర్గాల గడువు ముగిసి పదేళ్లు అవుతున్నప్పటికీ నేటికీ ఎన్నికలు నిర్వహించలేదు. గతంలో నియమించిన పర్సన్ ఇన్‌చార్జిలే సొసైటీలకు దిక్కుగా మారారు. ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జీలుగా పాత అధ్యక్షులనే పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించడంతో పాటు వారినే పదేళ్లుగా కొనసాగిస్తుండడంతో సొసైటీల అభివృద్ధి కుంటుపడుతోందని కార్మికులు పేర్కొంటున్నారు. సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి చేనేత అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడాలని కార్మికులు పేర్కొంటున్నారు.

ఐదేళ్ల క్రితం...

రాష్ట్ర వ్యాప్తంగా 11 ఫిబ్రవరి 2013లో చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికైన సంఘాల కాలపరిమితి 11 ఫిబ్రవరి 2018 నాటికి ముగిసింది. 2018 ఫిబ్రవరిలో గడువు ముగిసిన తర్వాత ప్రభుత్వం జీవో నంబర్ 568 సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జీలను నియమించింది. ఆనాటి నుంచి నేటి వరకు చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌చార్జిలను కొనసాగిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు చేనేత సొసైటీలు ఉండగా బెజ్జూర్‌లోని సొసైటీలో 52, చెన్నూర్‌లోని సొసైటీలో 77 మంది పని చేస్తున్నారు. అలాగే సొసైటీ నుంచి ముడిసరుకు తీసుకువెళ్లి వస్త్రం తయారు చేసేవారితో కలిపి 200 మంది వరకు ఈ రెండు సొసైటీల పరిధిలో ఉన్నారు.

ఎన్నికలు జరిగే సంఘాలు...

ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో చేనేత సహకార సంఘాలు లేకుండా పోయాయి. కొమురంభీం జిల్లాలో బెజ్జూరు, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో చెన్నూర్‌లో సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో కొమురంభీం జిల్లాలో బెజ్జూరు సంఘానికి మాత్రమే పాలక వర్గం ఉంది. ఆసిఫాబాద్‌లో సంఘం ఉన్నప్పటికీ వస్త్ర ఉత్పత్తి లేకపోవడంతో అక్కడ పర్సన్ ఇన్‌చార్జిగా అధికారే ఉన్నారు.

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు..



ప్రస్తుతం గతంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 568 ప్రకారం చేనేత సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జీలను నియమించింది. వారినే కొనసాగిస్తున్నాం. ప్రస్తుతానికి ప్రభుత్వం నుంచి ఎన్నికల నిర్వహణ విషయంలో ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. గతంలో ఇచ్చిన జీవో ప్రకారం పర్సన్ ఇన్‌చార్జిలే సంఘాల బాధ్యతలను చూసుకుంటున్నారు. –సంపత్‌కుమార్, చేనేత, జౌళిశాఖ, ఏడీ కరీంనగర్

పని ఒత్తిడితో ఎస్‌బీఐ మేనేజర్ ఆత్మహత్య

వాంకిడి: పనిఒత్తిడి భరించలేక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాంకిడి శాఖ మేనేజర్ పురుగుల మందు తాగగా ఆస్పత్రితో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఎస్సై సాగర్ వివరాల ప్రకారం.. జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన జనోత్ సురేష్ రెండేళ్ల క్రితం వాంకిడి మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లో మేనేజర్‌గా వచ్చారు. ఫీల్డ్ ఆఫీసర్ విధులు సైతం తానే నిర్వహిస్తూ పై అధికారుల ఒత్తిడికి గురయ్యాడు. డ్యూటీ అనంతరం ఇంటికి వెళ్లి పనిఒత్తిడితో నీరసంగా ఉండేవాడు. ఈ క్రమంలోనే గురువారం విధులకు వెళ్లిన మేనేజర్ సాయంత్రం 7.30గంటల సమయంలో బ్యాంకులోనే పురుగుల మందు తాగాడు. కొద్ది సేపటికి వాంతులు చేసుకోవడంతో గమనించిన బ్యాంకు సిబ్బంది ఆరా తీసి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మిరాజం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చింతగూడలో విషాదం


సురేశ్(ఫైల్)

జన్నారం: ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ బానవత్ సురేశ్ (35) ఆత్మహత్యకు పాల్పడగా మండలంలోని చింతగూడలో విషాదం నెలకొంది. బనావత్ లక్ష్మి రాజం, విజయ దంపతులకు ఇద్దరు కొడుకులు, కూతురు. సురేశ్ పెద్దవాడు. సురేశ్ బ్యాంక్ క్యాషియర్‌గా ఉద్యోగం సాధించాడు. వివిధ ప్రాంతాల్లో క్యాషియర్‌గా, సబ్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తూ సంవత్సరం క్రితం వాంకిడి మండలానికి మేనేజర్‌గా బదిలీ అయ్యాడు. ఆయనకు భార్య ప్రియాంక, కొడుకు విరాన్ (4)ఉన్నారు. సురేశ్ మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. ఆయన మరణవార్త తెలియగానే గ్రామానికి చెందిన బంధువులు కరీంనగర్ తరలివెళ్లారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గ్రామానికి తరలించనున్నారు.

క్రీడాకారుల ప్రతిభ..


ఎంపికైన క్రీడాకారులు

చెన్నూర్: స్టాఫ్ సెలక్షన్ కమిటీ శనివారం రాత్రి విడుదల చేసిన ఫలితాల్లో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్స్‌కు చెన్నూర్ పట్టణానికి చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు కారెంగుల రామయ్య ఆదివారం తెలిపారు. సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా రాసమల్ల ప్రేమ్‌కుమార్, ఐటీబీపీ ఫోర్స్‌కు రామగాని వేణు, ఎస్ఎస్‌బీకి పాసికంటి రాకేశ్, జోడు రాకేశ్, బీఎస్ఎఫ్‌కు దేశవు సాగర్‌లు ఎంపికయ్యారు. వారిని అథ్లెటిక్ కోచ్ విద్యాసాగర్, సీనియర్ క్రీడాకారుడు సంతోశ్ అభినందించారు.

విదేశాలకు పార్శిల్ సేవలు

పోస్టల్ లోగో

పాతమంచిర్యాల: తపాలా కార్యాలయం నుంచి విదేశాలకు పార్శిల్ పంపించే సదుపాయం ఇక నుంచి సులువు కానుంది. దేశవ్యాప్తంగా జూలైలో కేంద్ర ప్రభుత్వం ఈ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చింది. తెలుగు రాష్ట్రాల్లోని 55 పోస్టాఫీస్‌ల ద్వారా ఈ సేవలు పొందవచ్చు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంచిర్యాల, సిర్పూర్‌కాగజ్‌నగర్, నిర్మల్, ఆదిలాబాద్ పోస్టాఫీస్‌లో ఈ పార్శిల్ సర్వీస్‌లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాకేంద్రంలోని హెడ్‌పోస్టాఫీస్‌లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పార్శిల్ సర్వీస్‌లు ఆగస్టు మొదటి వారం నుంచి అధికారులు ప్రారంభించారు. వెబ్‌పోర్టల్‌లో నమోదు కోసం వినియోగదారులు తమ ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఫర్మ్ రిజిస్ట్రేషన్ ప్రూఫ్‌కార్డులతో పార్శిల్ సర్వీస్ ఉన్న పోస్టాఫీస్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటోంది. పార్శిల్ బుక్ చేసుకుంటే సిబ్బంది తమ ఇంటికే వచ్చి సేవలందిస్తారు. ఇందుకు వారు ఎలాంటి రుసుం చార్జీలు తీసుకోరు. పార్శిళ్ల బరువు ఆధారంగా నిర్ణీత చార్జీలే వసూలు చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



తపాలా ఆధ్వర్యంలో విదేశాలకు పార్శిల్ పంపించడం సులువు. తక్కువ ధరకే ఈ సేవలు పొందవచ్చు. వినియోగదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రైవేట్ పార్శిల్ సర్వీస్‌లకు వెళ్లి డబ్బు వృథా చేసుకోవద్దు. – ఆర్.రామారావు, జిల్లా పోస్టల్ అధికారి మంచిర్యాల

నేడు నాగుల పంచమి


పుట్టలో పాలుపోస్తున్న భక్తులు (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): నేడు నాగుల పంచమి.. శ్రావణ శుక్లపంచమి నాగారాధనకు శ్రేష్టమని గ్రామీణులు విశ్వసిస్తారు. అందుకే ఇతరాత్ర పండుగల వలే నాగుల పంచమిని కూడా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మహిళలు పాముల పుట్టల్లో పాలు పోసి తమ భక్తిని చాటుకుంటారు. నవధాన్యాలతో తయారు చేసిన పుట్నాలను సైతం నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ పర్వదిన్నాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు నాగుల పంచమిని ఘనంగా జరుపుకునేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు.

నాగవ్రతంతో మేలు...

నాగపంచమినాడు శాస్త్రోక్తంగా ఈ వ్రతాన్ని ఆచరిస్తే సంతానం కలుగుతుందని, అన్ని కార్యాలు సులభంగా జరుగుతాయని ప్రజల నమ్మకం. స్త్రీ పురుష జాతకంలో సర్పదోశం ఉంటే వారు శుద్ధపంచమి నాడు నాగవ్రతాన్ని ఆచరించి ప్రతి నెల శుక్లపంచమికి ఈ వ్రతం చేయడంతో సకల ప్రాప్తి కలుగుతుందని ప్రతీక. ఈ నేపథ్యంలో నవధాన్యాలతో పుట్నాలను చేసి తియ్యటి పరమాన్నంతో పాటు పాలను పాము పుట్టలో పోయడంతో అంతా శుభం జరుగుతుందని భక్తుల విశ్వాసం.

ఏరియర్స్ చెల్లింపు తేదీ ప్రకటించాలి


మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: 11వ వేతన ఒప్పందం తాలూకు ఏరియర్స్ చెల్లింపు తేదీని యాజమాన్యం వెంటనే ప్రకటించాలని సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు ఎస్.వెంకటస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల జీతంతో పాటు ఏరియర్స్ చెల్లించాలని కోలిండియాలో సర్క్యులర్ ఇచ్చినా సింగరేణి యాజమాన్యం ఇప్పటివరకు స్పందించటంలేదన్నారు. లాభాల్లో నడుస్తున్నామని చెబుతున్న యాజమాన్యం ఏరియర్స్ చెల్లింపులో ఎందుకు జాప్యం చేస్తుందో అర్థం కావటం లేదన్నారు, నాయకులు రాజేందర్, భరత్, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.